

# ప్రసేన్ సర్వస్వం

Being Prasen

# ప్రసేన్ సర్వస్వం

యోగి పబ్లికేషన్స్
ఖమ్మం

# Prasen Sarvaswam

by Prasen

First Edition November 2005

Cover Design
Gurumurthy

Cover Graphics
"Faces of the Hand"
Graphics by Author himself

FOR COPIES
Prasen
10-3-201/1
Mamillagudem
Khammam.
Ph: 9848997241
08742 - 238365
e-mail: prasenbk @yahoo.com
Copies : 1000

Price : 500/-

# కృతజ్ఞతలు

ఈ పుస్తకంలోని వ్యాసాలు, కవితలు ప్రచురించిన ఆయా దినపత్రికలకు, నా గత పుస్తకాలను సమీక్షించి పరామర్శించిన విమర్శకులకు, నన్ను ఇంతకాలం ప్రోత్సహించిన సాహిత్య మిత్రులకు, నా కవిత్వ భారాన్ని పుస్తకాల ప్రచురణకు ఖర్చయిన మొత్తాన్ని భరించిన నా ఇంద్రాణికి, తన కంప్యూటర్‌ను ఎవరు ముట్టుకున్నా సహించని మా అబ్బాయి శశాంకకు ఆ కంప్యూటర్ మీద ఓ నెలరోజులపాటు కంపోజ్ చేసుకోనిచ్చినందుకు, కవర్ పేజి డిజైన్ చేసిన గురుమూర్తికి సహకరించిన రఘుకు, కంపోజ్ చేసి పేజీలు డిజైన్ చేసిన ప్రసాద్‌కు,లోపలి పేజీలకు అవసరమైన ఫోటోలు ఇచ్చిన టివి9 అరుణ్ సాగర్‌కు ముఖ్యంగా మిత్రుడు పబ్బతి శ్రీనివాస్‌కు ఇంకా అనేక మందికి పేరు పేరునా .....

అనేక సాహిత్య సందర్భాలలో
చాలా మందితో
Impolite గా
వ్యవహరించినందుకు
పశ్చాత్తాప పడకుండానే
క్షమించమని కోరుతూ...
వాళ్లందరికి ...

# ఐ మీ మై సెల్ఫ్

కవిత్వ రూపం పరంగా తన సమకాలీన కవులకంటే
వందేళ్ళు ముందున్నాడు ప్రసేన్

– మో

కొన్ని కవితలు కేవలం రూపం కోసమే రాసినట్టుంటాడు.
రూపపరంగా అనవసర ప్రయోగాలు చేస్తాడు.
అసందర్భంగా నోరు తెరుస్తాడు ప్రసేన్

– జి.లక్ష్మీనర్సయ్య

ఇద్దరూ గొప్ప విమర్శకులే. ఇద్దరూ ఆంధ్రాంగ్ల సాహిత్యాలను
విమర్శతో సహా ఔపోసన పట్టినవారే. అటువంటి ఇద్దరికి రెండు
వేర్వేరు రకాలుగా అర్థమవటం వెనుక బహుశా నా తప్పే ఉండి ఉండాలి.
ఈ ఇద్దరికే కాదు ఇంకా చాలా మందికి చాలా రకాలుగా అర్థమో అపార్థమో
అయాన్నేను. నన్నర్థం చేసుకోవడానికి ఎవరూ ప్రయత్నించడంలేదనడంకన్నా
అందరికీ అర్థం కావడానికి నేనే ప్రయత్నం చేయలేదనడం సమంజసమేమో !

కవిత్వానికి తనదైన సొంత అర్థంలేదు. వచనానికి మాత్రమే తనదైన సొంత అర్థం ఉంది. కవిత్వానికి అర్థాలను ఆపాదించుకునే లక్షణం ఎక్కువ. వచనానికి ఆ అవకాశంలేదు. నా కవిత్వానికి లేని అర్థాలను ఆపాదించి సరిగా అర్థం చేసుకోలేదనీ అందుకే నేనుద్దేశించిన అసలు అర్థాలు కనుమరుగయాయనీ నా పిచ్చి నమ్మకం. నేను నాదైన సొంత అర్థంతో మరొకసారి వేదికనెక్కాలనే ఈ ప్రయత్నం. నేనిప్పటిదాకా రాసిందంతా ఒక దగ్గర కూర్చగలిగితే బావుంటుందనిపించి ఈ 'సర్వస్వం' సాహసం చేసాను.

నిజానికి దీనికి సర్వస్వమనైతే పేరు పెట్టాను కానీ ఇది ప్రసేన్ సర్వస్వం కానేకాదు. ఇక్కడో విషయం చెప్పాలి...తమ పేరుతో అచ్చయిన ప్రతీ కాగితమ్ముక్కనీ పదిలంగా దాచుకునే చాలా మందిని చూసి ఎకసెక్కాలాడే వాడిని. అచ్చయిన అక్షరం పరాయిదైపోయినట్టేనని బల్లగుద్ది వాదించేవాడ్ని. అందుకే నా రచనలేవీ నేను కత్తిరింపులుగా భద్రపరుచుకోలేదు. సర్వస్వం ఆలోచన ఆచరణలోకి తేవడానికి నేను చేసిన తప్పిదం పెద్ద ఆటంకంగా మారింది. నేను మళ్ళీ అచ్చేసుకోవాలని ముచ్చటపడ్డ నా చాలా రచనలు ఈ సర్వస్వంలో చేర్చలేకపోయాను. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీకి జైలు నుంచి రాసిన లేఖలు 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'ను నేను ఉదయం

దినపత్రికలో రెండు సంవత్సరాలపాటు ధారావాహికగా అనువదించాను. ఆ అనువాదాలకత్తిరింపులేవీ నాదగ్గరలేవు. ఆంధ్రజ్యోతి ఆదివారం మ్యాగజైన్‌లో దాదాపు పాతిక వారాలపాటు గళ్ళ నుడికట్టు నిర్వహించా. ఇది నాకు అత్యంత ఇష్టమైన ప్రక్రియ. అవి కూడా దాచుకోలేదు.

రెండున్నర సంవత్సరాలపాటు వారినికో మూడు చొప్పున ఆంధ్రభూమిలో సంపాదకీయాలు రాసాను. ఇవన్నీ ఎంవిఆర్ శాస్త్రి కర్కశనీడలో రాసినవే అయినప్పటికీ ఓ 40 దాకా నా మనసుకు బాగా నచ్చి రాసుకున్నవి ఉన్నాయి. అవన్నీ కూడా అచ్చేసుకుంటే బాగుండేదనే కోరిక ఉంది కానీ వాటి కత్తిరింపులను కూడా దాచుకోలేదు.

ఇక నా గురించి సోమసుందర్ రాసిన ఒక వ్యాసం కూడా అచ్చేసుకోవాలని కోరిక ఉండేది. అది కూడా నేను కత్తిరించి దాచుకోలేదు. ఆ వ్యాసంలో నా కవిత్వాన్ని ఆయన 'కుంభగత దీపకళిక' అని అందంగా తిట్టడం నాకెంతో నచ్చింది. జి.లక్ష్మీనర్సయ్య నా కవిత్వంలోని పారడాక్స్ గురించి రాసిన వ్యాసం కూడా నా దగ్గరలేకపోవడం నాకే బాధ కలిగించే అంశం. నేను చేసిన పుస్తక సమీక్షలు, సాహిత్య పేజీల నిర్వాహకుడిగా మోహన్‌ప్రసాద్, చేకూరి రామారావు, జయప్రభ, జి.లక్ష్మీనర్సయ్య వంటి వారిని నా పేరుతోనే చేసిన ఇంటర్వ్యూలు మరికొందరు ప్రముఖులను వేరే పేర్లతో చేసిన ఇంటర్వ్యూలు ఈ సర్వస్వంలో చేర్చలేకపోయాను. ముఖ్యంగా 'మాలబ్రాహ్మల దళిత ధాష్టీకం' 'ఆ విమర్శకుడి ఎడమకన్ను గుడ్డిది' వంటి వ్యాసాలను కూడా దాచుకోలేకపోవడం నాకు నేను చేసుకున్న ద్రోహం. కొందరు ప్రముఖ కవులు, రచయితలు నోబుల్ ప్రైజ్ తీసుకున్నపుడు చేసిన ప్రసంగాలను నేను ఉదయం సాహిత్య పేజీలో వరసగా అనువదించాను. నేను చేసిన అనువాదాల్లో చాలా కష్టమైనవీ నా కిష్టమైనవీ ఇవి. కానీ అవి కూడా నేను దాచుకోలేదు. ఆంధ్రభూమి వెన్నెలలో నేను రెండున్నరేళ్ళపాటు రాసిన ఓ నూటాపాతిక సినిమా సమీక్షలు నాకు బోలెడంత పేరుతెచ్చిపెట్టాయి.

ఇదంతా రాయడం ఎందుకంటే ఎవరూ ఇకముందు ఇటువంటి తప్పు చేయకూడదని చెప్పడానికే.. ఇదంతా చదివితే ఈ సర్వస్వంలో ఉన్న వాటికంటే లేనివాటి జాబితానే పొడుగ్గా ఉండేట్టుందని అనిపిస్తుందేమో కూడా !

కవిగా నన్ను లోకం గుర్తించింది కానీ నా వరకు నాకైతే వచనం అంటేనే చాలా ఇష్టం. వాక్యంతో విన్యాసాలు చేయించడంమీద చాలా ప్రేమ. పిచ్చి ప్రెస్‌నోట్‌లూ, డొల్ల ప్రెస్‌మీట్లూ, వదరుప్రసంగాలూ రాస్తూ సొంత వాక్యాన్ని నిలబెట్టుకోవడం జర్నలిస్టులు సాధించలేని పని అని నా నమ్మకం. జరుగుడు వాక్యాలూ గణనీయం, తెలిసింది, అభిజ్ఞవర్గాల భోగట్టా వంటి రొడ్డకొట్టుడు మూసమాటలు జర్నలిస్టుల భాషాభివృద్ధిని చంపేస్తాయి. అందుకే ప్రత్యేకమైన వాక్య విన్యాసంతో రాసే జర్నలిస్టులు తెలుగులో కనపడరు. కె.రామచంద్రమూర్తి, టంకశాల అశోక్, ఎబికె ప్రసాద్ రాతలు విషయ ప్రధానంగా మాత్రమే ఉండి సరళంగా ఉండడం వెనుక మర్మం అదే. ఈ వాదనకు వినహాయింపుగా ముగ్గురున్నారు.

కెఎన్‌వై పతంజలి, కె.శ్రీనివాస్, సతీష్‌చందర్. ఈ ముగ్గురి వాక్యవిన్యాసం అపూర్వం. ఈ ముగ్గురిలో మొదటి ఇద్దరికీ డొల్ల ప్రెస్‌మీట్లకు హాజరయి రాయాల్సిన బాధలేక పోవడం వాక్య విన్యాసానికి కారణం కావచ్చు. సతీష్ చందర్ మాత్రం జరుగుడు వాక్యాల్లోంచే ఎదిగి అదే వాక్యంతో ఎడాపెడా ఆడుకోవడాన్ని కూడా సొంతం చేసుకోగలిగాడు. జర్నలిస్టును కాకముందు చలం, వడ్డెర, చండీదాస్ వాక్యాన్ని ఎంత ఇష్టపడేవాడినో జర్నలిస్టుగా ముదిరిన తరువాత ఈ ముగ్గురి వాక్యాన్ని అంతే ఇష్టపడ్డాను. సరళమైన వాక్యం కొ.కు లాగానో ఆర్కే నారాయణ్‌లాగానో రాయడం చాలా కష్టం అని తెలిసీ ఎందుకో నచ్చేదికాదు. వాక్యం కొంత వంకరగా ఉండి తీరాలని బలంగా నమ్మాను. అందుకోసం ప్రత్యేకంగా ప్రయత్నం చేశాను. వార్త రాసేపుడొకటి, సినిమా రివ్యూకొకటి, సాహిత్య విమర్శకొకటి, రాజకీయ వ్యాఖ్యానానికొకటి, అనువాదానికొకటి వేర్వేరు వాక్యాల కోసం ప్రయత్నించాను. ఈ క్రమంలో ప్రోజ్‌మీద నాకు పిచ్చిప్రేమ పెరిగింది. అసలు ఈ సర్వస్వం ఆలోచన వెనుక కుట్ర కూడా నా వచనాన్నంతా ఒక చోట చేర్చడమే.

అయితే వచనం రాసిన ప్రతిసారీ నేను తీవ్ర విమర్శలకే గురయ్యాను. మొత్తం నా రాతనూ ఏదో ఒక దూకుడు వాక్యం సాకుతో కొట్టి పడేసేవారు. సీతారాం పుస్తకానికి ప్రసేన్ ముందుమాట అద్భుతంగా ఉంది కాని అఫ్సర్ మీద చేసిన వ్యాఖ్య అవసరమా అనీ... వెంటాడే కలాలు ముందు మాట గొప్పగా ఉంది కానీ ఎస్సీలను మరీ అంత తీసిపారేయాలా అనీ.. ఇలా ప్రతిసారీ ఏదో ఒక సన్నాయి నొక్కులు నొక్కేవారు. అలా నొక్కే అవకాశం ఇవ్వడం నా తప్పే కావచ్చు కానీ అటువంటి వాక్యాలు రాయకుండా లౌక్యం ప్రకటించడం నావల్ల అయేది కాదు.సాహిత్య విమర్శ ఎక్కువ భాగం సాహిత్యేతర అంశాల చేతే ప్రభావితమైందన్న విమర్శ ఇటువంటపుడే నిజమేనేమో అనిపిస్తుంది.అయినా సరే ప్రోజ్‌మీద నా ప్రేమ తగ్గలేదు. ప్రోజూ పోయెమూ గొప్పగా రాయగలిగిన వేగుంట చేత మెప్పు పొందిన నేను, వంకర వాక్యమే గొప్పదని నమ్మిన నేను సరళమైన వాక్యం రాయడమే కష్టమని గ్రహించివిచిత్రంగా చివరకు అక్కడికే చేరాను. ఈసర్వస్వంలోని తాజావాక్యాలన్నీ సాఫీగా ఉండడానికి నేను ప్రత్యేకంగా శ్రమించాను.

నా కవితా ప్రస్థానం రక్తస్పర్శతో మొదలైంది. ఏదో ఒకటి రాసేయడమే తప్ప ఏం రాయాలో ఏం రాయకూడదో ఎలా రాయాలో ఎలా రాయకూడదో తెలియని రోజులవి. సీతారాం చొరవ వల్ల అఫ్సర్, ప్రసేన్, సీతారాం ల కవితలతో రక్తస్పర్శ విడుదలైనప్పటికీ ప్రపంచం మా ఇద్దర్నీ కాదని అఫ్సర్‌ను మాత్రమే గుర్తించింది. సీతారాం, నేనూ మళ్ళీ మా మా వేర్వేరు పుస్తకాలు వేసుకున్న తరువాతకానీ మాకు గుర్తింపురాలేదు. అందుకో మరెందుకో తెలియదుకానీ అందరూ నన్ను రక్తస్పర్శ కవి అని అంటున్నా ఆ సంకలనం మీద నాకు ప్రేమ ఏర్పడలేదు. నాకు నా 'ఇంకా వుంది ' 'ఏదీకాదు' సంకలనాల మీద బోలెడంత ప్రేమ. బహుశా ఆ రెండు పుస్తకాలనీ పూర్తిగా సర్వస్వంలో చేర్చి రక్తస్పర్శను కొంత మాత్రమే తీసుకోవడానికీ అదే కారణం కావచ్చు. ఏదీకాదు తరువాత సీతారాం, అఫ్సర్, వంశీకృష్ణతో కలిసి అచ్చేసిన 'కవిత్వం'లో నేను రాసిన మంచి కవితలున్నాయని నా నమ్మకం..

నేను నా కవిత్వానికి అవార్డులేవీ అందుకోలేదు. నేను ఏ పోటీకీ ఏ సంస్థకూ నా పుస్తకాలను ఎన్నడూ పంపలేదు. తెలుగు సాహిత్య ప్రపంచంలో ప్రశంసలు సాహిత్యేతర కారణాలవల్లే దక్కుతాయని నేనొక వ్యాసంలో రాసిన వాక్యం అక్కసుతో రాసింది కానేకాదు. తెలుగు సాహిత్యలోకంలో ఎవరూ గాయపడడానికి సిద్ధంగా ఉండరు. ఎవరూ గాయపర్చడానికి కూడా సిద్ధంగా ఉందరు. స్క్రాచింగ్ ది బ్యాక్స్ సూక్తం జోరుగా నాట్యం చేస్తుంటుంది. నేనేమో చాలా మందిని చాలాసార్లు గాయపర్చాను. చేరాలో సాహిత్యాన్ని తూచే శక్తి ఉడిగిపోయిందన్నాను., లక్ష్మీనర్సయ్య కుల కవిత్వాన్ని తప్ప మరో కవిత్వాన్ని చూడని గుడ్డివాడన్నాను. అంపశయ్య నవీన్ పాతికేళ్ళ తరువాత కూడా 'అంపశయ్య' తోనే గుర్తింపు పొందడం లోపం అన్నాను, అఫ్సర్ లాంటి స్నేహితులుంటే వేరే శతృవులతో పనిలేదన్నాను. బేతవోలు రామబ్రహ్మంగారినీ అహం చేరామబ్రహ్మాస్మీ అన్నాను. ఇంకా చాలా మందిని చాలా చాలా అన్నాను. ఈ వ్యాఖ్యాల వెనుక దూకుడు ఉంటే ఉండవచ్చు కానీ ఎవరినీ గాయపరచ కూడదనే లౌక్యం లేదు. నేను అందుకు గర్వపడుతున్నాను. పశ్చాత్తాప పడకుండానే వాళ్ళందరికీ ఈ సర్వస్వం అంకితం ఇచ్చింది ఆ పొగరుతోనే.

నాకు తోచింది రాసాను. రాయకూడనిదేది రాయలేదన్న ఆత్మవిశ్వాసమూ నాకుంది.

కాలిక్యూలేషన్లూ ఈక్వేషన్లూ తెలియదు. నా ఈ ప్రయాణంలో ఎందరో నన్ను నడిపించారు. సహకరించారు. వారందరికీ కృతజ్ఞతలు. నేనేం రాసినా దాదాపు మొదటి పాఠకుడిగా భరించిన సీతారాం, ఎలా రాస్తే బావుంటుందో చర్చించిన వంశీకృష్ణ, ఎందుకు రాయాలో ప్రయోజనాలను విప్పిచెప్పిన గౌరీశంకర్, ఇలా రాయకూడదని చెప్పే యాకూబ్‌లే లేకపోతే నా రాతలు ఏనాడో ఆగిపోయేవి. ఇంకా కెఎన్‌వై పతంజలి, కాళ్ళ, మృణాళిని, కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, వసంతలక్ష్మి, చక్రధర్, జి.లక్ష్మీనర్సయ్య, మోహన్‌ప్రసాద్, గుడిపాటి, త్రిశ్రీఇంకా ఎందరెందరికో............చివరగా ఓ మాట..

ఆల్ ఆర్ట్ ఈజ్ కాంట్రవర్షియల్..అలాగే నేనున్నూ...

– ప్రసేన్

# నిర్మొహమాటలు

నిజానికి పుస్తకాల ముందుమాటలన్నీ మొహమాటపడి రాసేవే. ముందు మాటల్లో నిర్మొహమాటం ఉండనే ఉండదు. అయితే నేను రాసిన ముందుమాటలు మాత్రం ఖచ్చితంగా నిర్మొహమాటంగానే రాసాను. అందుకే ఈ విభాగాన్ని నిర్మొహమాటలు అంటున్నాను. నేనసలు పుస్తకాల ముందు మాటలకు బాగా వ్యతిరేకిని. నా పుస్తకాలు వేటికీ నేను ముందుమాటలు రాయించుకోలేదు. అందుకే నాకు ముందు మాటలు రాసే అర్హతలేదని నా మిత్రులంతా అంటుండే వాళ్లు. ఆ విషయం నాకూ తెలుసుకనుకనే చాలా మంది కవులు, కథకులు నన్ను తమ పుస్తకాలకు ముందుమాటలు రాయమని అడిగితే ముందుమాటలను వ్యతిరేకించే నాకు ముందుమాటలు రాసే అర్హతలేదని సున్నితంగానే తిరస్కరించాను. సీతారాం, వంశీకృష్ణ, జూలూరి గౌరీశంకర్, వెంటాడే కలాలు విషయాల్లో మాత్రం ఆ తిరస్కారం పని చేయలేదు. ఆ ముగ్గురూ నామీద ప్రేమతో రాయించు కున్నారు. వెంటాడే కలాలు ముందుమాట మాత్రం వాద తీవ్రతమీది ప్రేమతో రాసింది.


సీతారాం


వెంటాడే కలాలు
(వెనుకబడిన కులాలు)


డబ్బు పిట్ట
వంశీకృష్ణ


మాలకాకి
జూలూరు గౌరీ శంకర్

# దళితాత్మ కవిత

## ఇది ఆత్మ కవిత. ఆత్మ రక్షణ కవిత

దారి తప్పి ప్రయాణం ఆగిపోయిన దళితోద్యమానికి సరైన గమ్యంవైపు వెళ్ళే బలాన్నిచ్చే దిక్సూచి కవిత. దళితోద్యమకారులు బి.సిలను తమతో కలుపుకుపోవడానికి నిరాకరించినపటికీ సహానుభూతికి, స్వీయానుభూతికీ తేడా వుండదని నిరూపించే క్రమంలో ఉద్యమ జైత్రయాత్ర చేరుకున్న డెడ్ఎండ్ గోడలను పగలగొట్టే ఊతం ఈవెంటాడే కలాలు. ఇది బి .సి సూర్యోదయం. దళితోద్యమాన్ని బిఫోర్ క్రైస్ట్ నుంచి ఎ.డి. కి నడిపించే సహృదయం.

ఒకానొక చారిత్రక సందర్భంలో మొదలయిన తెలుగు దళిత కవిత్వ ఉద్యమం ఎక్కువ శక్తిని ఎవరు దళితులో తేల్చాల్సిన చర్చకే వృథా చేసుకుంది. నిజమే... ఘర్షణ లేని ఐక్యత ఉండదు. ఐక్యత వైపు పయనించే ఘర్షణే అసలు సిసలైన చైతన్యోద్యమం. దళితోద్యమం తెలుగులో ఘర్షణ దగ్గరే ఆగిపోయింది. బ్రాహ్మణీయ వాదమనే శత్రువు కొనసాగించే అణచివేతకు బలవుతున్న వారంతా ఒక్కటై పోరాడాలన్న సూత్రాన్ని ఎస్.సి.లు మరిచారు. దళితులంటే ఎస్.సిలు మాత్రమేనన్న వినాయింపు ధోరణికి, మైనారిటీలు, తెగలు,జాతులు,స్త్రీలు కూడా దళిత సమాఖ్యలో చేరితే అతివ్యాప్త దోషం చోటు చేసుకుంటుందేమోనన్న భయానికీ నడుమ ఒక కరచాలన రేఖను గీయడంలో అందరూ విఫలమయారు. ఆ వైఫల్యం చివరి వాక్యమే రేపటి దళితోద్యమపు మొదటి గెలుపు మాట.

బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా, దేశీయ మార్క్సిజం ఎజెండాగా మొదలయిన దళిత కవిత్వం ఉధృతంగా ఉన్నదశలో దళిత కవిత్వాన్ని ఎస్.సిలు హైజాక్ చేశారు. దళిత కవిత్వం అంటే ఎస్.సి కవిత్వమనీ, బూతుల బుంగలమయమనీ దళిత కవిత్వం పట్ల సానుకూల ధోరణితో ప్రవర్తించేవాళ్ళు సైతం భ్రమపడేలా చేశారు. దళిత కవిత్వానికి పునాది దేశీయ మార్క్సిజం అని జి.లక్ష్మీనర్సయ్య మొదట్లో అన్నప్పటికీ, సాలెల మగ్గం, జాలరి పగ్గం పక్కకిపోయి కిర్రుచెప్పుల భాష మాత్రమే మిగిలింది. దీన్ని ముందే ఊహించి మాలబ్రాహ్మల దళిత దాష్టీకం లాంటి వ్యాసాలతో దళిత కవిత్వంలో Self Introspection కి ఒక అవకాశం కల్పించారు. ఇందుకు ప్రతిస్పందనగా లోపాలనిసవరించుకుని మరింత బలం పుంజుకోవలసిన దళిత కవిత్వం, మాల కవిత్వం, మాదిగ కవిత్వంగా విడిపోయింది. మరింక దేశీయ మార్క్సిజం జాడలు చెరిగిపోయి,కుల కవిత్వ

ఘర్షణల దిశగా ప్రయాణించింది. కులాధిపత్య వ్యతిరేక కవిత్వం, కుల కవిత్వ ఆధిపత్య పోరాటంలోకి దారితప్పింది. దళిత కవిత్వంతో మొదటిసారిగా గొంతుకలిపిన బి.సి కవులు మరో చారిత్రక సందర్భంలో బి.సి సూర్యోదయాన్ని ఊహిస్తున్నారు. ఆ దిశగా బి.సి. కవిత తొలి అడుగు మాత్రమే ఇది.
ఇందులోని కవులంతా ఈప్రతిపాదనను పూర్తిగా అంగీకరిస్తున్నారని మేం భావించడంలేదు. నిజానికి ఈకవులందరి చైతన్యమూ దీనికి శిరసావహించి పని చేయాలనీ మేం భావించడం లేదు.
వెంటాడే కలాలలోని కవిత్వంలోని కవిత్వం బిసి కవులది మాత్రమే. తెలుగులో ఇప్పటిదాకా వచ్చిన దళిత కవిత్వంలో ముప్పాతిక మువ్వీసం భాగం బి.సి.కవులదే. అయినా ఎస్సీలు దళిత కవిత్వాన్ని హైజాక్ చేశారు. బ్రాహ్మణీయ భావ జాలాన్ని అంతం చేశామంటూ మాల మాదిగ కవులు వినిపించిన తొడ కొట్టుళ్ళ చప్పళ్ళు దళిత కవిత్వానికి పెద్దగా మేలు చేయలేదు.

కులాధిపత్య పోరాటాన్ని చేయాల్సిన దళిత కవిత్వం కుల స్థిరీకరణనే మునుపటికన్నా అధికంగా బల పరిచింది తెలుగు సాహిత్యంలో ఇటీవల కిందికులాల కవుల పట్ల చిన్నచూపు అధికంగా స్థిరపడడానికి ఈ ధోరణే కారణం. అందుకే పత్రికలు దళిత కవిత్వంపట్ల ఒక చెక్‌పెట్టాం .దళిత కవులు ,దళిత కెరీరిస్టు కవులు తమకొచ్చిన పేరుతో సంతృప్తిపడి పెన్నుమూశారు. దళితకవులుగా వెలుగులోకి వచ్చిన వారంతా తమ సంస్కృతిలోని విస్తృతిని, వైవిధ్యాన్ని , సాంస్కృతిక మూలాలని ఆవిష్కరించడం గురించి ఆలోచించకుండా యితర అంశాలను తిట్లు, శాపనార్థాలతో రంగరించడం వల్ల దళిత కవిత్వంలో మొనాటనీ మాత్రమే మిగిలిపోయింది.

దళిత కవిత్వంతో సమాంతరంగా భారతీయ సమాజంలోకి అడుగుపెట్టిన ఆర్థిక సరళీకరణను ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల సారాంశాన్ని, ఈసందర్భంలో నిర్వర్తించాల్సిన ప్రత్యేక పాత్రనూ దళిత కవులు బలంగా విస్మరించారు.ఈఅంశాన్ని బి.సి కవులు మాత్రమే గుర్తించారు.. సరళీకరణ ప్రభావం దళిత జీవితం మీద ఎంత బలంగా వుంటుందో చూసే దూరదృష్టి దళితులకు లేకపోయింది. దళిత కవులు కవిత్వమే సామాజిక ఉద్యమం అనేభ్రమలో కొట్టుకు పోయారు. సమాజవిశ్లేషణలోనూ, నిర్వచించడంలోను తొందరపాటు నిర్ధారణలకు వచ్చారు. సమాజాన్ని నిర్వచించడం వేరు, సమాజాన్ని మార్చడంవేరు అనే నిజాన్ని గ్రహించలేకపో యారు. కేవలం మార్క్సిజం వ్యతిరేకతే దళిత ఉద్యమ ఊపు అని నమ్మారు. వ్యక్త నిర్మాణం,గుప్తనిర్మాణంలో వుండే సంక్లిష్టత దళిత కవులకు అర్థం కాలేదు. పునాదిని వ్యతిరేకించే క్రమంలో అనేక అంశాలను గుర్తించడంలో విఫలమ య్యారు. ఎస్సీలు గుర్తించిన అంశాలు కవిత్వానికి సమగ్రత నివ్వలేదు. బిసిలు దాన్ని గుర్తించారు. బిసిలు తటస్థులుగా నిలవలేదు. సంశయులుగా మిగలలేదు. సామాజిక సమీకరణలు, రాజకీయ సమీకరణలు మారతాయికానీ కవిత్వ సాంద్రతలో మార్పుండదు అనే అంశాన్ని కూడా దళితులు గుర్తించలేదు ప్రత్యామ్నాయ సాంస్కృతిక నిర్మాతలు కేవలం ఎస్సీలు మాత్రమే కాగలరని దళితులు నమ్మారు. ఎస్సీలు అసంఘటిత కులాలు అనే అంతర్లీనమైన అంశం వారికర్థం కాలేదు. బిసిల్లో ప్రతికులం సంఘటితం. దళిత కవిత్వం రెండుగా విడిపోయిన సందర్భంలో కూడా బిసి కవులు సంఘటితంగసే వున్నారు. అంతమాత్రంచేత బిసిలలో సూక్ష్మరూపాల్లో కూడా అంతరాలు లేవని కాదు. ఈవాస్తవాలన్నీ దళిత వాదులకు తెలియక కాదు . అయితే చాలామంది దళిత వాదులలోని కెరీరిస్టు లక్షణం ఉద్యమానికి నష్టం చేసింది. ఆ క్రమంలోనే నిజాలు తెలుసుకున్న కొందరు అంబేద్కర్ ఆత్మకు పూలే మాస్కు తొడగాలని చూసారు. ఇప్పటికీ ఆ ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి.పూలే సెమినార్లు, ఆడంబరంగా పూలే వర్ధంతులు , జయంతులు జరగడానికి ఇదేకారణం . అంబేద్కర్ పట్ల సమాజంలో ముఖ్యంగా ఆ పై సమాజంలో వినబడుతున్న నిరసన కూడా దళితులు గుర్తించగలిగారు . ఇది ఒకరకంగా చైతన్యం.... మరోరకంలో ఒక

చమత్కారం. దళిత ఉద్యమం సామాజికంగా గానీ , రాజకీయంగాగానీ , అంబేద్కర్ వైపు నుంచి పూలే వైపుప్రయాణించడాన్ని ప్రత్యామ్నాయ భావజాలంతో ఒక మెరుగైన అడుగుగా కనిపిస్తున్న రాజకీయాన్నీ బిసిలు అధ్యయనం చేస్తున్నారు. హిందుత్వ భావజాలాన్ని ఎదుర్కొనడానికి రాజకీయంగాగానీ, సామాజికంగాగానీ అంబేద్కర్‌ను కాక పూలేను ముందుపెట్టడం ద్వారా రెండు ప్రయోజనాలను సాధించదలచినట్లు స్పష్టమవుతోంది . బిసిలను తమవైపు ఆకర్షించుకోవడం ఒకటి. దళిత ఉద్యమం పట్ల ఎదురయ్యే మార్క్సిస్టుల , హిందుత్వవాదుల నుంచి వచ్చే దాడులను పాసిఫై చేసుకుంటూ రావడానికి బిసిల అవసరాన్ని గుర్తించి ఆ రకంగా తమ ఉనికిని, ఆధిపత్యాన్ని నిరూపించటం రెండోది. కాబట్టే ఐదేళ్ళ క్రితంకన్నా ఇప్పుడు పూలే జయంతుల గురించి వర్ధంతుల గురించి వినగలుగుతున్నాం. పూలే పేరిట సోషల్ సైన్సెస్ పీఠాలు, పాఠశాలలు నెలకొల్పబడుతున్నాయి. ఒక మాటలో చెప్పాలింటే పూలేను దళిత దొరలు హైజాక్ చేస్తున్న సామాజిక సందర్భంలో బిసిల కవితాసంకలనం రావడం.. దాన్ని మేం తేవడం ఆనందంగా వుంది. దీనిలో బిసి కవులు చేసిన పని తమ ఆత్మకథలను వినిపించడమే. దీనిలోని బిసి కవులంతా ఒక ప్రాంతీయాత్మతో పలుకుతున్నారు. ఎక్కువమందికి ఈ సామ్యం వర్తిసుంది. కోస్తా దళితులలోని ఉద్రిక్తతగాని , ఆత్మగౌరవాన్ని పొందే క్రమంలో ఆధిపత్య ధోరణిగాని వీరిలో కనిపించదు.

కులాల,కులవృత్తుల, ఆ వృత్తుల్లో వున్న తమ తాతల, తండ్రులు, తల్లులు పడినబాధలకు తమ తరపు చైతన్యంతో పల్లవి కట్టే ప్రయత్నం చేశారు. దళిత కవిత్వానికిలేని అంతర్జాతీయ చైతన్యం ఈ కవులకు వుంది. దళిత కవిత్వానికి లేని క్రమశిక్షణ ఈ బిసి కవులకుంది.

ఆత్మగౌరవం కేవలం రాజకీయ నినాదం కానక్కర్లేదని అదొక జీవన విధానంగా మారాలన్న ఆకాంక్షలో భాగంగా ఈ కవిత్వం వెలువడిందని నమ్మకంగా చెప్పగలం.

ఇది దళితాత్మ కవిత ! దళితాత్మ రక్షణ కవిత.

**(వెంటాడే కలాలు బిసి కవితా సంకలనం ముందు మాటగా జూలూరు గౌరీశంకర్‌తో కలిసి రాసింది)**

**End of Preview.**

**Rest of the book can be read @ [http://kinige.com/kbook.php?id=1551](http://kinige.com/kbook.php?id=1551)**

* * *